


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 598 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 28 శుక్రవారం నవంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం



## దేవతల రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతా



-వెంకటపాలెం శ్రీవారి ఆలయ విస్తరణ పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన
రెండు దశల్లో రూ.260 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులు
రెండేళ్లలో ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని టీటీడీకి సూచన
రాజధాని కోసం భూములిచ్చిన రైతులను అభినందించిన ముఖ్యమంత్రి

రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో కొలువైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ విస్తరణ పనులకు సీఎం చంద్రబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, పలువురు ఎమ్మెల్యేలు, రైతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

2

## గ్లోబల్ సమ్మిట్‌పై సీఎం రేవంత్ సమీక్ష

### పాలసీ డాక్యుమెంట్‌పై భేటీలో చర్చ



హైదరాబాద్,నవంబర్27
తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025పై రోజూ వరుస సమీక్షలు చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డి గురువారం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రోజుకో అంశంపై చర్చిస్తున్నారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌పై ఈ భేటీలో చర్చించారు. పాలసీ డాక్యుమెంట్‌పై సీఎం రేవంత్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా.. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని సూచించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేలా స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీలో ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ పాలసీ, భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా పాలసీ డాక్యుమెంట్ ఉండాలని అధికారులకు సూచించారు. కాగా డిసెంబర్ 8,9 తేదీల్లో ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించనున్నట్లు సీఎం రేవంత్ ఇప్పటికే వెల్లడించారు. కేంద్ర మంత్రులతో పాటు సమ్మిట్‌కు ఆహ్వానించాల్సిన దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖుల జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.

## ఆన్‌లైన్ కంటెంట్‌పై బాధ్యత ఉండాల్సిందే:

### -సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

-ఆన్‌లైన్ కంటెంట్‌కు జవాబుదారీతనం తప్పనిసరి అన్న సుప్రీంకోర్టు
-సొంత ఛానల్ ఉందని బాధ్యతారాహిత్యంగా ఉండటం సరికాదని కీలక వ్యాఖ్యలు

2



## మతం ఏదైనా మానవత్వం మర్చిపోకూడదు:

### - మంత్రి నారా లోకేశ్

-మంగళగిరిలో నూర్ మసీద్‌ను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్
-మతం కంటే మానవత్వమే గొప్పదని కీలక వ్యాఖ్యలు
-భవిష్యత్ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపు
రాష్ట్ర, దేశాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సూచన



2








## పంచ భూతాలలో నీరు అత్యంత ప్రధానమైనది

### - పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 27 : పంచ భూతాలలో నీరు అత్యంత ప్రధానమైనదని, ఒక్క నీటి చుక్క కూడా వృథా పోకుండా కాపాడుకోవాలని లేకపోతే భవిష్యత్తులో నీటి యుద్ధములు వస్తాయి అని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా హెచ్చరించారు. గురువారం పిఠాపురం జిల్లా కోర్టు ఆవరణలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్ ను పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి, 11వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మెరుగు రాజారావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఫణీంద్ర, సూపరింటెండెంట్ శాంతి ప్రియ, కోర్టు సిబ్బంది, ప్లాంటేషన్ కన్వీనర్ ముదునూరి సూర్యావతి తదితరులు పాల్గొన్నారు. మంతెన సుబ్బరాజు జ్ఞాపకార్థం వారి కుమార్తె ముదునూరి సూర్యావతి మినరల్ వాటర్ ప్లాంట్ ను స్పాన్సర్ చేయగా పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా, జడ్జి శ్రీహరి, సూర్యావతికి శాలువ కప్పి సత్కరించారు. అనంతరం కోర్టు కాంపౌండ్ లో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నా మొక్క - నా శ్వాస అనే కార్యక్రమంలో 36 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ మూడు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. న్యాయమూర్తి శ్రీహరి మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ తో పాటు ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ద్వారా మొక్కలు నాటించిన పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామికి, ట్రస్ట్ కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి, మున్సిపల్ కమిషనర్ పి.రాజు, న్యాయమూర్తి శ్రీహరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మెరుగు రాజారావు, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, రేఖా ప్రకాష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అల్లవరపు నగేష్ తదితరులు పాల్గొన్నారు



# పవన్ కల్యాణ్‌వి తెలివితక్కువ మాటలు:

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన 'దిష్టి' వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల మధ్య రాజకీయ దుమారం రేపుతున్నాయి. కోనసీమ పచ్చదనానికి తెలంగాణ నేతల దిష్టి తగిలిందన్న పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్‌వి తెలివితక్కువ మాటలని, మెదడుకు పనిచెప్పకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు."మా దిష్టి వాళ్లకు తగలడం కాదు, ఇన్నేళ్లుగా వాళ్ల దిష్టే మా తెలంగాణకు, హైదరాబాద్‌కు తగిలింది" అని జగదీశ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ప్రతిరోజూ వందలాది మంది ఏపీ నుంచే హైదరాబాద్‌కు వస్తున్నారని, అలాంటప్పుడు తమ దిష్టి ఎలా తగులుతుందని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ దిష్టి తగులుతుందని అంత భయంగా ఉంటే, ఓ దిష్టిబొమ్మ పెట్టుకోవాలని, దాన్ని తామేమీ ఆపలేదని వ్యంగ్యంగా అన్నారు. "ఇంత తెలివిలేని వాళ్లు కూడా ఉప ముఖ్యమంత్రులు అవుతున్నారంటే ఆశ్చర్యంగా ఉంది" అంటూ జగదీశ్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.బుధవారం కోనసీమ జిల్లా రాజోలులో 'పల్లె పండుగ 2.0' కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పచ్చని కోనసీమకు తెలంగాణ నాయకుల దిష్టి తగిలింది. ఇక్కడి కొబ్బరి చెట్ల పచ్చదనాన్ని చూసే బహుశా వారికి ప్రత్యేక రాష్ట్రం ఆలోచన వచ్చిందేమో" అని వ్యాఖ్యానించారు. నరుడి దిష్టికి రాయి కూడా పగిలిపోతుందని ఆయన పేర్కొన్నారు.పవన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశం కాగా, జగదీశ్ రెడ్డి తాజా ప్రతిస్పందనతో రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ మాటల యుద్ధం రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది

# మతం ఏదైనా మానవత్వం మర్చిపోకూడదు:

మతం ఏదైనా మానవత్వాన్ని ఎన్నడూ మరవకూడదని, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవ అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. యువత భవిష్యత్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, రాష్ట్ర, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం మంగళగిరిలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న పావురాల కాలనీలో నూతనంగా నిర్మించిన 'నూర్ మసీద్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మస్జీద్‌ను ప్రారంభించి, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "మంగళగిరి ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం నాకు దక్కింది. నాకున్న శక్తి మేరకు సేవ చేస్తున్నాను. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి రాష్ట్ర ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. మనతో ఉన్నవారిని పైకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. సమాజంలో ఇంకా పేదరికం ఉంది, దానిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు.తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ, "2019లో దేవుడు నాకు ఒక కఠినమైన పరీక్ష పెట్టాడు. చాలామంది నన్ను ఎగతాళి చేశారు. కానీ, అదే దేవుడు నాకు శక్తిని, పట్టుదలని ఇచ్చాడు. క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తే విజయం తప్పక వరిస్తుంది. కష్టాలు అందరికీ వస్తాయి, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి" అని యువతకు స్ఫూర్తినిచ్చారు. కాలం మారిందని, యువత చదువుపై దృష్టి సారించి భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

2047 నాటికి దేశాన్ని అగ్రస్థానంలో నిలపాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా అందరూ పనిచేయాలని లోకేశ్ కోరారు. "మెరుగైన సమాజ నిర్మాణం కోసం నైతిక విలువలు చాలా అవసరం. ముఖ్యంగా మహిళలను గౌరవించాలి. మన మధ్య విభేదాలు సృష్టించడానికి కొందరు ప్రయత్నిస్తుంటారు, అలాంటి వాటికి తావివ్వకుండా ప్రశాంతంగా ఉండాలి. ప్రజలు నా పనిని గుర్తించినప్పుడే నాకు కొండంత బలం. అందరికీ అండగా ఉంటూ, కలిసికట్టుగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేద్దాం" అని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ నేత పోతినేని శ్రీనివాసరావు, మసీదు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహమ్మద్ అలీ, కమిటీ సభ్యులు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేశామని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. గురువారం విజయవాడలోని సివిల్ సప్లైస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నేటి వరకు 8,22,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, రైతుల ఖాతాల్లో రూ. 1,713 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 4 నుంచి 6 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, రైతులు రూపాయి కూడా నష్టపోకుండా కల్లాల వద్దే ధాన్యం కొంటున్నామని స్పష్టం చేశారు.కొంతమంది నేతలు ధాన్యం కొనుగోళ్లపై అనవసరంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, రైతులు అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. గత ప్రభుత్వం రైతులకు రూ. 1,674 కోట్ల బకాయిలు పెడితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ బకాయిలన్నింటినీ చెల్లించిందని గుర్తుచేశారు. ఈ సీజన్‌లో ఒక్క కృష్ణా జిల్లాలోనే లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం ఒక రికార్డు అని అన్నారు. గోదావరి జిల్లాల్లోనూ లక్ష టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు రేయింబవళ్లు కష్టపడుతుంటే, వారి మనోధైర్యం దెబ్బతినేలా కొందరు విమర్శలు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వం 2022-23లో 3,33,155 మెట్రిక్ టన్నుల ధాన్యం కొని రూ. 679.79 కోట్లు చెల్లిస్తే, తమ ప్రభుత్వం ఇప్పటికే అంతకు రెట్టింపు స్థాయిలో కొనుగోళ్లు జరిపిందని పోల్చి చెప్పారు.రవాణా వ్యవస్థను కూడా పటిష్టం చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24లో కేవలం 455 లారీలు నమోదు కాగా, తమ ప్రభుత్వంలో ఇప్పుడు 2,715 లారీలు నమోదు చేసుకున్నాయని వివరించారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో రవాణా వాహనాల బకాయిలు రూ. 9 కోట్లు చెల్లించామని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో 7.53 కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచామని, ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో అదనంగా మరో లక్ష సంచులను సిద్ధం చేశామని చెప్పారు.వాతావరణ మార్పుల దృష్ట్యా రైతుల ఆందోళనను గమనించి మూడు నెలల్లో జరగాల్సిన ప్రక్రియను ముందే ప్రారంభించామన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం 30వ తేదీ తర్వాత కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వర్ష సూచన ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో ఒకటో తేదీ నుంచి ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వర్షాల నుంచి పంటను కాపాడేందుకు కౌలు రైతులకు టార్పాలిన్ పట్టాలు సిద్ధంగా ఉంచామన్నారు. దళారులు మాయమాటలు చెప్పి తక్కువ ధరకు ధాన్యం కొనే ప్రయత్నం చేస్తారని, ప్రభుత్వం 75 కిలోల బస్తాకు రూ. 1792 మద్దతు ధర చెల్లిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ-క్రాప్‌లో నమోదైన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు.

# గ్రామ పంచాయితీ ఎన్నికల్లో పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

, నిజామాబాద్ ప్రతినిధి :

రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు సెట్ కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ పలు సూచనలు చేశారు. ఎన్నికలు నిష్పాక్షపాతంగా నిర్వహణ ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ పోలీస్ బాధ్యత అని అన్నారు. జిల్లాలో ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని, ఎన్నికలలో ఓటర్లను ప్రభావితం చేయడానికి అక్రమంగా డబ్బు , మద్యం లేదా ఇతర పదార్థాలు రాకుండా చెక్‌పోస్టుల వద్ద ఇతర శాఖల సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విజిబుల్ పోలిసింగ్, నాకబందీలు , ఆకస్మిక తనిఖీలు నిరంతరం జరగాలని తెలిపారు. ఎస్.హెచ్.ఓలు , వీ.పీ.వోలు ప్రతి గ్రామాన్ని సందర్శించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించడంతో పాటు గ్రామాల్లో పెట్రోలింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాలని అన్నారు. సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు, ఇతరుల భావోద్వేగాలను దెబ్బతీసే విధమైన చర్యలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. ప్రతీ సిబ్బంది ముందస్తు సమాచారం సేకరించాలని, అట్టి సమాచారం ఎప్పటి కప్పుడు తమ పై అధికారులకు తెలియజేయాలని అన్నారు. లాడ్జీలు, గెస్ట్ హౌసులు , కమ్యూనిటీ హాలులు , ఫంక్షన్ హాలుల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, అనుమానితుల కదలికలను పర్యవేక్షించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన అంశాల్లో, రాజకీయ కార్యకలాపాల్లో పోలీస్ సిబ్బంది ఎలాంటి ప్రమేయం ఉండకూడదని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన చోటుచేసుకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో వివాదాస్పద కేసుల్లో, అలాగే ఇతర కేసుల్లో నమోదైన రౌడీషీటర్లను బైండోవర్ చేసి వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. నేటి నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ ప్రక్రియ సందర్భంగా నామినేషన్ కేంద్రాల వద్ద పకడ్బందీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నామినేషన్ సమయంలో అనవసర గుమికూడేలా అనుమతించకూడదని, వాహనాలు అనుచరుల సంఖ్య నియమాల పరిధిలో ఉండేలా చూసుకోవాలని , కేంద్రం లోపల , బయట సీసీటీవీ పర్యవేక్షణ తప్పనిసరి చేయాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల మధ్య ఘర్షణలు, వాగ్వాదాలు రాకుండా పోలీసులు ముందుగానే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సెట్ కాన్ఫరెన్స్‌లో పోలీస్ కమీషనర్ తో పాటు అదనపు డిసిపి బస్వా రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ రమేష్, ఎలక్షన్స్ సెల్ ఇన్స్పెక్టర్ వీరయ్య, ఐటీ కోర్ సిబ్బంది, సెట్ కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.




# పౌరసత్వానికి ఆధార్ కార్డు రుజువు కాదు

దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వారికి కూడా ఆధార్ కార్డులు అందుతున్నాయని, అలాంటప్పుడు ఆధార్ కార్డు ఉన్నంత మాత్రాన వారికి ఓటు హక్కు కూడా కల్పించాలా? అని సుప్రీంకోర్టు కీలక ప్రశ్న లేవనెత్తింది. ఆధార్ కార్డు కేవలం సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేరవేయడానికి మాత్రమేనని, దానిని పౌరసత్వానికి లేదా ఓటు హక్కుకు రుజువుగా పరిగణించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను (%ూ×=%) సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. "పొరుగు దేశం నుంచి వచ్చిన ఓ కూలీకి రేషన్ కోసం ఆధార్ కార్డు ఇస్తే, అతడిని ఓటరుగా కూడా చేయాలా?" అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. ఎన్నికల సంఘం కేవలం పోస్టాఫీసు కాదని, ఓటరు దరఖాస్తుతో పాటు సమర్పించిన పత్రాల వాస్తవికతను పరిశీలించే అధికారం దానికి ఉందని స్పష్టం చేసింది.పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. ఈసీ చేపట్టిన ప్రక్రియ నిరక్షరాస్యులైన సాధారణ ఓటర్లపై రాజ్యాంగ విరుద్ధమైన భారం మోపుతోందని అన్నారు. ఫారాలు నింపడం తెలియని వారిని జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధార్ పౌరసత్వానికి తిరుగులేని రుజువు కాకపోయినా, నివాసానికి సంబంధించి ప్రాథమిక ఆధారంగా పరిగణించాలని వాదించారు.తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు సంబంధించిన పిటిషన్లపై డిసెంబర్ 1లోగా సమాధానం దాఖలు చేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

# ప్రపంచానికే ఆదర్శం మన యువత..

.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు.దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని కొనియాడారు.గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్-టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

# ఆన్‌లైన్ కంటెంట్‌పై బాధ్యత ఉండాల్సిందే:

సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే కంటెంట్‌కు ఎవరో ఒకరు తప్పనిసరిగా బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సొంతంగా ఛానల్ ప్రారంభించినంత మాత్రాన ఎవరికీ జవాబుదారీగా ఉండననుకోవడం సరికాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియాకు సంబంధించిన ఓ వివాదంపై గురువారం విచారణ సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారంపై అభ్యంతరకర ప్రశ్నలు అడిగిన ఘటనలో రణ్‌వీర్ వివాదాస్పదుడయ్యారు. ఈ కేసు విచారణకు రాగా, ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. "అసభ్యకరమైన కంటెంట్ అప్‌లోడ్ చేస్తే అది వైరల్ అవుతుంది, లక్షల మంది చూస్తారు. దీన్ని ఎలా నియంత్రిస్తారు? దేశ వ్యతిరేక కంటెంట్ పెట్టినప్పుడు దానికి సదరు క్రియేటర్ బాధ్యత వహిస్తారా?" అని కేంద్రాన్ని ప్రశ్నించింది.కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, ఇది కేవలం అశ్లీలతకు సంబంధించిన అంశం కాదని, యూజర్లు సృష్టించే కంటెంట్‌లోని లోపాలను ఇది ఎత్తిచూపుతోందని అన్నారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను వక్రీకరించకూడదని ఆయన పేర్కొన్నారు.వాదనలు విన్న ధర్మాసనం, ఆన్‌లైన్ కంటెంట్‌ను పర్యవేక్షించే వ్యవస్థ ఉన్నప్పటికీ ఇలాంటివి ఎందుకు జరుగుతున్నాయని కేంద్రాన్ని నిలదీసింది. సోషల్ మీడియాలో వినియోగదారులు సృష్టించే కంటెంట్‌ను నియంత్రించేందుకు సరైన నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. ఇందుకు కేంద్రానికి నాలుగు వారాల సమయం ఇచ్చింది.

# దేవతల రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతా

మొత్తం రూ.260 కోట్ల అంచనా వ్యయంతో రెండు దశల్లో ఈ పనులను చేపట్టనున్నారు. తొలి దశలో రూ.140 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం, ఏడంతస్తుల మహారాజగోపురం, వివిధ మండపాలు, పుష్కరిణి వంటివి నిర్మించనున్నారు. రెండో దశలో రూ.120 కోట్లతో మాడ వీధులు, అన్నదాన సత్రం, యాత్రికుల వసతి సముదాయాలు, పరిపాలన భవనం వంటివి నిర్మిస్తారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... దేవతల రాజధాని స్ఫూర్తితో మన అమరావతిని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. "రాజధాని కోసం 33 వేల ఎకరాలు త్యాగం చేసిన ఈ ప్రాంత రైతులకు నా ధన్యవాదాలు. అమరావతిపై ఎవరికీ ఎలాంటి అనుమానం అవసరం లేదు" అని ఆయన అన్నారు. తిరుమల వేంకటేశ్వరుడు తమ ఇలవేల్పని, అలిపిరి దాడి నుంచి ఆయనే తనకు ప్రాణభిక్ష పెట్టారని గుర్తుచేసుకున్నారు.గత ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టి విధ్వంసం సృష్టించిందని విమర్శించారు. ఈ పవిత్ర ఆలయ నిర్మాణాన్ని రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని టీటీడీ అధికారులను ఆదేశించారు. ఆలయాల నిర్మాణంలో భక్తులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, సంపద ప్రసాదించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

# రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

**- ఇప్పటికే అన్నదాత సుఖీభవ రెండు విడతల నగదు జమ**

**- సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది**

**- ఆలమూరు మండలం సంధిపూడిలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



ఆలమూరు, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 27 : సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని, అన్నదాతలు ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే రెండు విడతల అన్నదాత సుఖీభవ నిధులు పీఎం కిసాన్ నిధులతో కలిపి కర్షకుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. గురువారం ఆలమూరు మండలం సంధిపూడిలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి రైతన్నా మీకోసం కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వం అన్నదాతలకు అందిస్తున్న పెట్టుబడి సాయంతో పాటు వివిధ పథకాల గురించి వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు అండగా నిలిచేందుకు రైతన్నా మీకోసం పేరుతో ప్రభుత్వం చైతన్యవంతమైన కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్,ప్రభుత్వం నుంచి మద్దతు అనే పంచ సూత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ – పి.యం.కిసాన్ పథకం కింద రెండు విడతల్లో ఒక్కొక్కరికి రూ.14 వేల వంతున అందజేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.13,500 మాత్రమే ఇచ్చి మాట తప్పిందన్నారు. అందరూ వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. మహిళా రైతులకు 35శాతం సబ్సిడీతో పాటు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కోసం రావులపాలెంలో ఒక ఆఫీసు తెరుస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం మీద దృష్టి పెట్టాలన్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి రైతులకు అన్నివిధాలా ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. డ్రోన్ల తదితర ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహనతో ముందుకు వెళ్లాలని సూచించారు. పురుగుమందులు, ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. క్యాన్సర్, దీర్ఘకాలిక రోగాలు పెరగడానికి కారణం రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగమేనని తెలిపారు. రైతులంతా ప్రకృతి సేద్యంపై దృష్టి పెడితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.

# వాల్మీకుల ఎస్టి అంశం పైన పార్లమెంటులోనా ప్రస్తావన చేయండి....

**బివిఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారెళ్ల అంజి**

పత్తికొండ టౌన్ ్ బ్యూరో నవంబర్ 27

పత్తికొండ: బోయ వాల్మీకి సమితి బిబిఎస్ సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ కర్నూలు జిల్లా ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే యోగేష్ కు వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ అంశంపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది అనంతరం బోయ వాల్మీకి సమితి బివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మారెళ్ళ అంజి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గారు 2018 లో మడకశిరలో మరియు 2023 జోడి యాత్ర సందర్భంగా కర్నూల్ జిల్లా కు వచ్చినప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వాల్మీకుల ఎస్టి పునర్దన చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కేంద్రంలో నా కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాలేదు కానీ పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష హెూదాలో ఉన్నారు. పార్లమెంటులో వాల్మీకి అంశాల పైన ప్రస్తావించాలి. మా వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునర్ధన అంశం పైన సభల లో, యాత్రల సందర్భంగా మరియు ఎన్నికలు సమీపం వచ్చినప్పుడు మాత్రమే కాంగ్రెస్ పార్టీ మాట్లాడడం జరుగుతుంది. అధికారంలో లేకపోయినా కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష హెూదాలో ఉన్నారు కాబట్టి మా వాల్మీకిల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ అంశం పైన పార్లమెంటులోనా ప్రస్తావన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీవీఎస్ పత్తికొండ డివిజన్ అధ్యక్షులు మహేందర్ నాయుడు, దూదికొండ ఏవి నాయుడు, పెద్దవూల్తి తాయన్న, ఎద్దులదొడ్డి , తుగ్గలి హనుమంతు తదితరులు పాల్గొన్నారు



# రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత ఈ ప్రభుత్వానిదే

**-రైతన్నా-మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత....-త్వరలో ముఖ్యమంత్రి ఒక మంచి పథకాన్ని తీసుకురాబోతున్నారన్న సునీత....**

**-పొలం పిలుస్తోంది, మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత.... -రైతులకు అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలని సూచన....**



రాప్తాడు నవంబర్..27

రాప్తాడు:రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధరలు కల్పించే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం మాదాపురం పంచాయతీ కొత్త గాదిగకుంట గ్రామంలో రైతన్నా-మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామ సమీపంలో ఉన్న అక్కమ్మ గార్ల గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాదాపు 5ఎకరాల విస్తీర్ణంలో 5వందల చింత మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే సునీత స్వయంగా మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం పలువురు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం గురించి, అలాగే గత 17 నెలలుగా ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటల సాగు దగ్గర నుంచి దిగుబడుల వరకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తెగుళ్ల విషయంలో ఎలాంటి మందులు వాడాలి వంటి వాటి మీద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పశువులకు సంబంధించిన దానాను కూడా రైతులకు 50% సబ్సిడీతో అందజేశారు. గడ్డికి సంబంధించి జొన్నలు కూడా పంపిణీ చేశారు. గొర్రెలు, మేకలకు ఎలాంటి రోగాలు రాకుండా ముందస్తుగా వ్యాక్సినేషన్ ను కూడా అందజేశారు. సమీపంలోని అరటి తోటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. అరటి పంటను పరిశీలించి దిగుబడులు ఎలా ఉన్నాయి.. ధరలు ఎంత మేర ఉన్నాయి అన్నది రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల కోసం అనేక కార్యక్రమాలు తీసుకొచ్చిందన్నారు. పూర్తి స్థాయి సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు అందజేస్తోందన్నారు. సబ్సిడీతో గోకులం షెడ్లు కూడా నిర్మాణాలు చేపట్టిందన్నారు. విత్తన సబ్సిడీ దగ్గర నుంచి పశు వులకు అవసరమైన వ్యాక్సిన్ వరకు అన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు అందజేస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఇప్పటికే 14 వేల రూపాయలు రైతులు అకౌంట్లో జమ చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం పార్టీలు చూసి కులాలు చూసి పథకాలు అమలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం మాటలతో రైతులకు చేసిందేమీ లేదని విమర్శలు చేశారు. ప్రస్తుతం మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టినట్లు వివరించారు. నాటిన ప్రతి మొక్క రేపు మహావృక్షం కావాలని దాని వలన రైతులకు ఆదాయం చేకూరాలన్నారు. మొక్కలు కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. మరోవైపు రైతులందరూ ఒకే రకం పంటలు సాగు చేయ వద్దన్నారు. పంట దిగుబడులు వచ్చే సమయానికి మార్కెట్లో ఏ పంటకు ధరలు ఉంటాయన్నది అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం కొన్ని పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని మేము ప్రతి రైతు తరపున ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని.. రైతులందరికీ లాభం చేకూర్చేలా త్వరలో ఒక మంచి పథకాన్ని తీసుకురాబోతున్నట్లు ఆమె వివరించారు. రాప్తాడు నియోజకవర్గంలో రిజర్వాయర్లన్నీ పూర్తిచేసేలా చూస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే సునీత వివరించారు.



# జయంతి ఉత్సవాల ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 27 : తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో జనవరి 2026న నిర్వహించనున్న స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల ప్రచార పోస్టర్ ను కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య బి.సురేష్ లాల్, తెలుగు వెలుగు సాహితీ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ తో కలిసి ఆవిష్కరించారు. గురువారం విశ్వవిద్యాలయంలోని అర్థశాస్త్ర విభాగంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ లాల్ మాట్లాడుతూ తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ లాంటి మహనీయుల జయంతి ఉత్సవాలను నిర్వహించాలనే సంకల్పం గొప్పదన్నారు. సంస్థ ఆధ్వర్యంలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక చైర్మన్ పోలోజు రాజ్ కుమార్, బంగారు నంది అవార్డు గ్రహీత డాక్టర్ వేముల తిరుపతి రెడ్డి, మీడియా కో-ఆర్డినేటర్ జోనగోని యాదగిరి గౌడ్, డాక్టర్ సుద్దాల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నా మీకోసం వస్తున్నాం

**కరపత్రాలు ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన....**

**నలకదొడ్డి టిడిపి అధ్యక్షులు బత్తిన రాజశేఖర్....**

పత్తికొండ

పత్తికొండ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'రైతన్నా మీ కోసం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే గురువారం మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో ఎమ్మెల్యే కేఈ.శ్యాంకుమార్.టిడిపి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోకనాథ్ లు ఆదేశాల మేరకు టిడిపి గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన పథకాలపై కరపత్రాలు ద్వారా ఇంటింటికి వెళ్లి రైతులకు అందించారు.అందులో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు,ఆధునిక పద్ధతులు అవలంభించేందుకు,ప్రకృతి వ్యవసాయం,టెక్నాలజీ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్,పెట్టుబడి సాయం వంటి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టారని అన్నారు.పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధి కేఈ.శ్యాం కుమార్ తోనే అభివృద్ధి చెందుతుందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సచివాలయ పంచాయతీ సెక్రెటరీ దివ్య,టిడిపి నాయకులు రఘు శేఖర్, హరివర్ధన్,మల్లికార్జున,శ్రీనివాసులు, నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలపై పనిభారం తగ్గించాలి

**-సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర....**

పత్తికొండ

పత్తికొండ:అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ సంఘం ఆదోనిలో శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నా కార్యక్రమానికి పత్తికొండ ప్రాజెక్టు అంగన్వాడి టీచర్లు వెళ్తున్న దృష్ట్యా పత్తికొండ సి డి పి ఓ లలిత కు సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర ఆధ్వర్యంలో అనుమతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు పని భారం తగ్గించాలని 26000 గౌరవ వేతనం ఇవ్వాలని టుజీ సిమ్ముల స్థానంలో ఫైవ్ జి ట్యాబులను ఇవ్వాలని ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను అంగనవాడి టీచర్లు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గోపాల్, అంగన్వాడి టీచర్లు సోమేశ్వరి, సాజియా, కృపమ్మ, కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కె.పి.నూతన పెట్రోల్ పంపును ప్రారంభించిన ఎర్రకోట. రాజీవ్ రెడ్డి. ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరు నవంబర్ 27

కర్నూల్ రోడ్‌లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కే. సునీల్ కుమార్ ఏర్పాటు చేసిన "కె.పి అండ్ సన్స్" పెట్రోల్ పంప్‌ను వైయస్సార్ కాంగ్రెస్ ఘనంగాప్రారంభించారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్టీనాయకులు,కార్యకర్తలు,వ్యాపారవేత్తలు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూప్రజలకు నాణ్యమైనఇంధనాన్ని,వేగవంతమైన సేవలను అందించాలనే లక్ష్యంతో ఆధునిక సదుపాయాలతో ఈ పెట్రోల్ పంప్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రాంతీయులకు, ప్రయాణికులకు, రైతులకు ఈ పెట్రోల్ పంప్ ఎంతో సౌకర్యాన్ని అందిస్తుందని తెలిపారు. ప్రాంత అభివృద్ధికి తోడ్పడే ఈ సేవా కార్యక్రమానికియాజమాన్యానికిశుభాకాంక్షలుతెలియజేశారు.కర్నూల్ రోడ్ పరిసరాల్లో నూతనపెట్రోల్.పంపుప్రారంభంకావడంప్రయాణికులకు మరింత సౌకర్యం కలిగిస్తుందని అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్.కాంగ్రెస్.పార్టీనాయకులు,కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు

# కర్నూలు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి'...

**పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ క్రాంతినాయుడు**

పత్తికొండ టౌన్

పత్తికొండ :కర్నూలు జిల్లా డీసీసీ అధ్యక్ష పదవిని యువతకు ఇవ్వాలని ఏఐసీసీ, పీసీసీ అబ్జర్వర్ యోగేశ్, శంకర్లకు పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ క్రాంతి నాయుడు కోరారు. కర్నూలు జిల్లా వెనుకబడిందని తనకు డీసీసీ అధ్యక్షుడుగా అవకాశం కల్పిస్తే అభివృద్ధి పథంలో నడిపిస్తానని నాయుడు కోరారు. జిల్లాలో వలసలు, విద్యా, వైద్య ఉపాధి సమస్యలపై అబ్జర్వర్లకు ఆయన నివేదిక అందజేశారు.






# సినిమా & టీవీ ఇండస్ట్రీ కోసం ప్రత్యేకంగా సినెటేరియా రియల్ ఎస్టేట్ & లక్జరీ ఎక్స్ పో 2025

**- సినిమా వారికి 90 శాతం వరకు బ్యాంకుల రుణాలు - నటులు, నిర్మాతలు, దర్శకులు, టెక్నీషియన్లకు ప్రత్యేక వీవీఐపి పాసులు**

**- సినెటేరియా మెగా రియల్ ఎస్టేట్ షో డిసెంబర్ 27, 28 తేదీలలో**

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 27 : ప్రముఖ బ్రాండింగ్ సంస్థ సినెటేరియా మీడియా వర్క్స్ సినీ పరిశ్రమ మరియు వ్యాపారస్తులకోసం ప్రత్యేకంగా "సినెటేరియా మెగా రియల్ ఎస్టేట్ %ం% లక్జరీ ఎక్స్ పో 2025" నిర్వహిస్తోంది. జూబిలీహిల్స్ కన్వెన్షన్ సెంటర్ లో డిసెంబర్ 27, 2025 నుంచి డిసెంబర్ 28, 2025 వరకు నిర్వహించనున్న ఈ మెగా రియల్ ఎస్టేట్ %ం% లక్జరీ ఎక్స్ పో ఈవెంట్ కు ప్రముఖ మీడియా సంస్థ లు ద టైమ్స్ ఆఫ్ ఇండియా, టి–న్యూస్, మెట్రో టీవీ, డైలీ హిందీ మిలాప్, చలన చిత్రం – డిజిటల్ మ్యాగజైన్ సంస్థలు మీడియా భాగస్వాములుగా ఉన్నాయి.

సినెటేరియా మెగా రియల్ ఎస్టేట్ %ం% లక్జరీ ఎక్స్ పో 2025 సినిమాలకు బ్రాండింగ్ ద్వారా సహకారాన్ని అందిస్తున్న ప్రముఖ రియల్ ఎస్టేట్, జెవెలరీ, ఆటోమోబైల్, ఎలక్ట్రానిక్స్, బ్యూటీ %ం% ఫ్యాషన్ సంస్థలు ఈ ప్రత్యేక "సినెటేరియా రియల్ ఎస్టేట్ %ం% లక్జరీ ఎక్స్ పో 2025"లో పాల్గొనున్నాయి. ప్రముఖ లగ్జరీ విల్లాలు, అపార్ట్ మెంట్, ఇండిపెండెంట్ ఇల్లు, ఇళ్ల స్థలాలు, ఫాం హౌజ్ లు, రిసార్ట్ వెంచర్లు ఈ ఎక్స్ పోలో పాల్గొంటున్నాయి. అలాగే లగ్జరీ కార్లు, స్పోర్ట్స్ కార్లు, ఎలక్ట్రిక్ కార్లు, బైకులు, ఈవీ స్కూటర్, బంగారు నగల వ్యాపారస్తులు, బ్యూటీ మరియు ఫ్యాషన్ కు చెందిన పలు సంస్థలు ఈ మెగా ఎక్స్ పోలో పాల్గొంటున్నాయి.

**- సినిమా వారికోసం - ఉచిత "వి.వి.ఐ.పి. గోల్డెన్ పాస్"**

ఈ "సినెటేరియా మెగా రియల్ ఎస్టేట్ %ం% లక్జరీ ఎక్స్ పో 2025" పాల్గోదలచిన సినీ పరిశ్రమ %ం% టెలివిజన్ ఇండస్ట్రీలకు చెందిన నటీనటులు, నిర్మాతలు, దర్శకులు, టెక్నీషియన్లు, డిస్ట్రిబ్యూటర్ల కోసం సినెటేరియా ప్రత్యేకంగా వి.వి.ఐ.పి. గోల్డెన్ పాస్ లను ఉచితంగా అందిస్తోంది. నటీ నటులు మరియు సెలెబ్రిటీలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండడం కోసం ప్రత్యేకంగా సెక్యూరిటీ వారిని ఏర్పాటు చేయడంతోబాటు, ప్రత్యేకమైన వి.వి.ఐ.పి లాంజ్ ను ఏర్పాటు చేస్తోంది. అలాగే వి.వి.ఐ.పి. గోల్డెన్ పాస్ ద్వారా ఎక్స్ పోను సందర్శించే ప్రతి ఒక్కరికీ హై–టీ, స్నాక్స్ ఉచితంగా ఇవ్వడంతోపాటు పలు బహుమతులు అందిస్తోంది.

**- సినిమా వారికి 90 శాతం ఇంటి ఋణాలు**

సినిమా పరిశ్రమ, టెలివిజన్ మరియు ఇన్స్ టాగ్రాం/యూట్యూబ్ స్టార్లుగా కొనసాగుతున్న వారికి బ్యాంకులు 90 శాతం వరకు రుణాలు అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇందుకోసం పలు జాతీయ మరియు ప్రైవేటు బ్యాంకులు "సినెటేరియా మెగా రియల్ ఎస్టేట్ & లక్జరీ ఎక్స్ పో 2025"లో తమ బ్యాంకు స్టోరీస్ ఏర్పాటు చేస్తున్నాయి. సినీ పరిశ్రమలో ఖచ్చితమైన మినిమం ఆదాయం ఉన్నవారికి కూడా ఇల్లు, అపార్ట్ మెంట్ లో ప్లాట్లు కొనుగోలుకు బ్యాంకులు రుణాలు అందించడానికి సిద్ధంగా ఉన్నాయి.

– గమనిక : వి.వి.ఐ.పి. గోల్డెన్ పాస్ కోసం పోస్టర్ లో ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్ 8712217555 ద్వారా సంప్రదించవచ్చు.




## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం మనమంతా ఆరోగ్యంగా ఉందాం...

**- మొగల్లూరు లో చెత్త బండిని పరిశీలించిన ఎంపీడీవో గంగాధర్..**

వెలిగండ్ల,

మొగళ్లూరు గ్రామపంచాయతీలో గురువారం ఉదయం స్థానిక పంచాయతీ గ్రామ కార్యదర్శి కొండయ్య తో కలిసి, ఇంటింటి నుండి సేకరించిన తడి చెత్త ,పొడి చెత్త కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీడీవో గంగాధర్, కార్యదర్శి కొండయ్య, ఇరువురు కలసి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వారి వారి ఇండ్లలో పరిశుభ్రత పాటించినప్పుడే గ్రామం కూడా పరిశు భ్రంగా పచ్చదనంగా ఉంటుందని దానివలన మనమంతా ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. అలాగే ఇండ్లలో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అప్పుడే దోమల బెడద నుంచి మనం సురక్షితంగా ఉండగలమన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తర్లుపాడులో మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

తర్లుపాడు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు మార్కాపురం జిల్లా చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లా ఏర్పాటుకు కృషి చేసిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ తర్లుపాడు మండల కేంద్రంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మరియు ఉపముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, జిల్లా ఏర్పాటు పట్ల తమ సంతోషాన్ని, కృతజ్ఞతలను తెలియజేశారు.ఈ సందర్భంగా జనసేన మండల నాయకులు వెలుగు కాశీరావు మాట్లాడుతూ మార్కాపురంను జిల్లా కేంద్రంగా ప్రకటించడం వలన ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరిందని, ఈ నిర్ణయం ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పాలన వికేంద్రికరణ ద్వారా పరిపాలన సౌలభ్యం సులభ తరం అవుతుందని జిల్లా కేంద్రం కూత దూరం లో ఉండటం వలన పరిపాలన కు ప్రజల కు సమస్యలు తెలుపెందుకు అందుబాటు లో ఉంటుందని జిల్లా వలన పశ్చిమ ప్రకాశం అభివృద్ధి తో పాటు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కూడా పెరిగి నిరుద్యోగ కొరత కూడా తగ్గుతుందని అన్నారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కూటమి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం లో సొసైటీ చైర్మన్ వెలుగు క్రాంతి కుమార్,మార్కాపురం జనసేన వీర మహిళ సిద్ధం కృష్ణ వేణి, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు సురే సువర్ణ,టిడిపి మండల ఉపాధ్యక్షులు షేక్ ఖైరు, ఎస్ యం సి చైర్మన్ వెన్నా రాజా రామ్ రెడ్డి, తర్లుపాడు బూత్ కన్వీనర్ షేక్ ఖాసీం వలి, మాజీ కోప్షన్ షేక్ అఫ్రోజ్ జనసేన నాయకులు పఠాన్ కరీముల్లా,గంజరపల్లి మహేష్,కొండెబోయిన సునీల్, గుంటు మోషే, చీకటి శివకాశీ,టిడిపి నాయకులు బొప్పరాజు శ్రీనివాసులు, షేక్ బాషా,షేక్ బాదుల్ల,గుంటు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్ట్ బషీర్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కావలి,

కావలి పట్టణం జనతా పేటలో నివాసముంటున్న సీనియర్ జర్నలిస్ట్, ఆంధ్రప్రభ కావలి ఇంచార్జ్ ఎస్.కె. బషీర్ కుటుంబాన్ని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పరామర్శించారు. ఇటీవల బషీర్ తండ్రి ఖాదర్ భాష మృతి చెందడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసినఎమ్మెల్యే నివాసానికి వెళ్లిఖాదర్భాషకి నివాళులర్పించారు.కుటుంబసభ్యులు కన్నీటితో తల్లడిల్లుతున్న వేళ, వారిని ఓదార్చి, వారి బాధను పంచుకుంటూ ఎమ్మెల్యే ఎంతో ఆదరణగా మాట్లాడారు. "మీ కుటుంబం ఏ కష్టంలోనైనా నేను మీ పక్కనే ఉంటాను%ొ% మీకు అవసరం అయితే ఎప్పుడైనా చెప్పండి" అని బషీర్ కుటుంబానికి ధైర్యం నిచ్చారు. ఖాదర్ భాష సేవలు, శ్రమ, కుటుంబంపై ఆయన చూపిన ప్రేమను స్మరించుకుంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలనిప్రార్థించారు..ఎమ్మెల్యే మాటలు విన్న బషీర్ కుటుంబసభ్యులు భావోద్వేగానికి గురై కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు,స్థానిక వార్డు ప్రజలు పాల్గొని కుటుంబానికి అండగా నిలిచారు.



Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com